సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 13 । మార్చి । 2025




టన్ను చీనీ రూ.24,890

అనంతపురం మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24,890, కనిష్టంగా రూ.5,800 ప్రకారం ధర పలికాయి.



స్థిరంగా టమాట ధర

టమాట ధర స్థిరంగా కొనసాగుతోంది. బుధవారం కక్కలపల్లి మండీలో కిలో టమాట గరిష్టంగా రూ.8 కనిష్టంగా రూ.5 ప్రకారం ధర పలికింది.



పుట్టపర్తిలో యువ గర్జన



'యువత పోరు' ర్యాలీలో వేలాదిగా పాల్గొన్న విద్యార్థులు, యువకులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు



యువత, విద్యార్థులతో కలిసి 'యువత పోరు' ర్యాలీలో కదం తొక్కుతున్న ఉషశ్రీచరణ్, కేతిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఈరలక్కప్ప, మక్బూల్, గోరంట్ల మాధవ్, అత్తార్ చాంద్‌బాషా తదితరులు

ఫీజు అందక..
చదువు'కొన'లేక..
కష్టపడి చదువుకున్నా కొలువు దక్కక..
అవమానాలు.. అవహేళనలు.
అన్నింటినీ భరించినా.. ఆదరణ కరువు.
అందుకే 'యువత పోరు' బాట పట్టింది.
అన్యాయ పాలనపై కదం తొక్కింది.
కవాతుతో పుట్టపర్తిలో గర్జించింది.
వైఎస్సార్‌సీపీ అండతో సమరనాదం చేసింది.
కూటమి నేతల గుండెల్లో..
గుబులు పుట్టించింది.

యువత పోరు.. జనహోరు

- పుట్టపర్తిలో కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- జిల్లా నలుమూలల నుంచి వచ్చిన యువత, విద్యార్థులు
- 'యువత పోరు'కు స్వచ్ఛందంగా మద్దతు తెలిపిన ప్రజలు
- కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ.. జేసీకి వినతిపత్రం అందజేత
- ఫీజు బకాయిలు చెల్లించాలని వైఎస్సార్‌సీపీ నేతల డిమాండ్
- కూటమి పాలనపై నిప్పులు చెరిగిన యువత
- హామీలు అమలు చేయకపోతే గద్దె దింపుతామని హెచ్చరిక
- అడ్డుకునేందుకు అడుగడుగునా పోలీసుల నిఘా
- ఆంక్షలను దాటుకుని ఆకాంక్షను వినిపించిన యువతరం

సాక్షి, పుట్టపర్తి

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాక విద్యార్థి కడుపు మండింది. ఉపాధిలేక నిరుద్యోగుల ఆక్రోశం మిన్నంటింది. చంద్రబాబు సారథ్యంలోని కూటమి సర్కార్‌పై సమరశంఖం పూరించింది. పాలకుల దగా పాలనను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో బుధవారం పుట్టపర్తిలో నిర్వహించిన 'యువత పోరు'లో కదం తొక్కింది.

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి విద్యార్థులు, యువత, విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలిరాగా, పుట్టపర్తి పొలికేక పెట్టింది. మండే ఎండను సైతం లెక్క చేయకుండా ఆద్యంతం ఉత్సాహంగా సాగిన 'యువత పోరు' పాలకుల గుండెల్లో గుబులు పుట్టించింది.

చీమలదండుగా కదిలి..

'యువత పోరు' నేపథ్యంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి యువకులు, విద్యార్థులు చీమలదండులా కదిలి వచ్చారు. బుధవారం ఉదయం నుంచే పుట్టపర్తికి చేరుకోవడం కనిపించింది. మామిళ్లకుంట క్రాస్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు వాహనాల రద్దీ నెలకొంది. పుట్టపర్తిలోని గణేశ్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు జన సందోహం విస్తరించింది. ర్యాలీలోనూ నిరసన నినాదం మిన్నంటింది.

చేతగాని ప్రభుత్వం దిగిపోవాలి..

'యువత పోరు'కు విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా తరలివచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. వారికి మద్దతుగా అన్ని నియోజకవర్గాల నుంచి వందల వాహనాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నేతలు తరలివచ్చారు. చేతగాని కూటమి సర్కారు వెంటనే దిగిపోవాలని నినాదాలు చేస్తూ గణేశ్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ కొనసాగించారు. అడుగడుగునా పోలీసు ఆంక్షలు విధించినా తమ ఆకాంక్షను వినిపించేందుకు ముందుకే సాగారు. కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులకు ప్రజాస్వామ్య పద్ధతిలోనే నిరసన తెలిపారు.

జేసీకి వినతిపత్రం అందజేత..

ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్తలు టీఎస్ దీపిక, ఈరలక్కప్ప, బీఎస్ మక్బూల్, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి నర్సేగౌడ, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, జిల్లా నేత వజ్రభాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, రెడ్డి సంఘం నాయకుడు జనార్దన్‌రెడ్డి తదితరులు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ర్యాలీలో పార్టీ మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ డిమాండ్లు ఇవే..

- ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి.
- నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం ఇచ్చి చంద్రబాబు ఎన్నికల వేళ ఇచ్చిన మాట నిలుపుకోవాలి
- మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయడాన్ని ఉపసంహరించుకోవాలి.
- విద్యార్థులకు వసతి దీవెన బకాయిలు వెంటనే విడుదల చేయాలి.



కలెక్టరేట్ ఎదుట భారీగా మోహరించిన పోలీసులు



జేసీకి వినతిపత్రం అందజేస్తున్న ఉషశ్రీచరణ్, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి,దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, దీపిక, మక్బూల్, ఈరలక్కప్ప, మాధవ్ తదితరులు



ర్యాలీలో ఓ విద్యార్థిని ఉత్సాహం

ప్రజలు తిరగబడే రోజులొచ్చాయి



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. ఎన్నికల సమయంలో ఇంటికో ఉద్యోగం అంటూ ఆశపెట్టిన చంద్రబాబు... ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదు. కానీ ఇప్పటికే నాలుగు లక్షల ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి నారా లోకేశ్ అబద్ధాలు చెప్పడం హాస్యాస్పదం. పథకాలు అమలు చేయకుండా.. అబద్ధాలు చెబుతూ పబ్బం గడిపితే ప్రజలే తిరగబడతారు. బెల్టు షాపుల ద్వారా దొడ్డిదారిన ఉపాధి పొందేందుకు టీడీపీ కార్యకర్తలను ప్రోత్సహిస్తుండటం బాధాకరం.

– తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే

వైద్య రంగాన్ని కాపాడుకుందాం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగానికి పెద్దపీట వేశారు. మెడికల్ కాలేజీల ఏర్పాటుతో పాటు ఆరోగ్యశ్రీ జాబితాలో వేల సంఖ్యలో జబ్బులను చేర్చి.. పేదలకు ఉచితంగా వైద్యం అందించారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని నిర్వీర్యం చేస్తోంది. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేసి.. వ్యాపారం చేయాలని భావిస్తోంది. ప్రజలందరూ మేల్కొనాలి. వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన పోరాడుతుంది.

– టీఎస్ దీపిక, హిందూపురం సమన్వయకర్త

మాట నిలబెట్టుకోవాలి



విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలి. ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా నిరుద్యోగ భృతి ఇవ్వాలి. కూటమి ప్రభుత్వం అబద్ధాలు చెప్పి కాలయాపన చేస్తుందనే సంగతి ప్రజలు గమనిస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీరు మార్చుకోకుంటే రానున్న రోజుల్లో ప్రజల పక్షాల పోరాటాలు ఉధృతం చేస్తాం. ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీ పడే ప్రసక్తే లేదు.

– బీఎస్ మక్బూల్, కదిరి సమన్వయకర్త

అందరూ ఇబ్బందుల్లో ఉన్నారు



కూటమి ప్రభుత్వ నిర్వాకంతో ఫీజులు కట్టలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెట్టుబడి సాయం అందక ఎంతో మంది రైతులు కాడెద్దులను.. భార్య తాళిబొట్టును.. అమ్ముకోవాల్సిన దయనీయ స్థితి నెలకొంది. చంద్రబాబు పాలన తీరు చూస్తుంటే.. రాష్ట్ర ప్రజలు పందెం గుర్రాన్ని అమ్ముకుని... ముసలి గాడిదను తెచ్చుకున్నట్లుగా ఉంది. విద్య, వైద్య రంగాలు బాగుండాలంటే.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారు.

– గోరంట్ల మాధవ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి

మోసం... చంద్రబాబు నైజం



ఎన్నికల సమయంలో ఓట్ల కోసం కల్లబొల్లి కథలు చెప్పిన చంద్రబాబు.. అధికారం చేపట్టాక ఏ ఒక్క పథకం అమలు చేయలేదు. చంద్రబాబు పాలన తీరును గమనిస్తే ప్రజలను మోసగించడమే ఆయన నైజమని స్పష్టంగా తెలుస్తోంది. ఇప్పటికైనా భావి తరం భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలి. నిరుద్యోగ భృతి ఇవ్వాలి. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఉపసంహరించుకోవాలి. 'యువత పోరు' విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

ప్రజల పక్షాన పోరాడతాం



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ఎందరికో మేలు చేశారు. నేడు చంద్రబాబు.. సర్కారు..ఆ రెండు రంగాలను నిర్వీర్యం చేసింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయలేదు. చివరకు ఆరోగ్యశ్రీకి కూడా ఆంక్షలు విధించడం బాధాకరం. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాటం చేస్తుంది. ప్రతిపక్షంలో ఉన్నా.. పాలక పక్షంలో ఉన్నా.. వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ ప్రజల పక్షాన ఉంటుంది.

– కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే

ప్రజలే బుద్ధి చెబుతారు



గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన ఏ ఒక్క పథకం ఇప్పుడు అమలులో లేదు. వైఎస్ జగన్‌ను టార్గెట్ చేసుకుని.. సంక్షేమ పథకాలను రద్దు చేసిన చంద్రబాబుకు ప్రజలే బుద్ధి చెబుతారు. రాష్ట్రంలో 2.67 లక్షల మంది వలంటీర్లను నియమిస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చాక జీతం పెంచుతామని హామీ ఇచ్చి.. ఉన్న ఉద్యోగం కూడా ఊడగొట్టింది. కూటమి సర్కారు వచ్చి తొమ్మిది నెలలు గడిచిపోయాయి. ఇంకెన్నో రోజులు ఈ ప్రభుత్వం నిలవదు.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే

సీఎంగా ఉండే అర్హత లేదు



సూపర్ సిక్స్ పేరుతో ఆరు పథకాలు ఇస్తామని చెప్పిన చంద్రబాబు.. అందులో ఏ ఒక్క పథకం కూడా అమలు చేయలేదు. మనిషి ఎదుగుదలకు అవసరమయ్యే విద్య, వైద్య రంగాలను నిర్వీర్యం చేయడం బాధాకరం. కేవలం వారి కార్యకర్తల బాగోగులు మాత్రమే చూసే చంద్రబాబు రాష్ట్రానికి సీఎంగా ఉండటానికి ఏ మాత్రమూ అర్హుడు కాదు. ఓటేసిన ప్రజలే చంద్రబాబును తిట్టడం మొదలుపెట్టారు. బీజేపీ, జనసేనతో పొత్తుపెట్టుకోవడం వల్లే చంద్రబాబు సీఎం అయ్యారు.

– ఈరలక్కప్ప, మడకశిర సమన్వయకర్త

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్



సీఎస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ చేతన్

ప్రశాంతి నిలయం: పదో తరగతి పరీక్షలకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ విజయవాడ నుంచి కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పదో తరగతి పరీక్షల నిర్వహణ, పీ–4 మోడల్ సర్వే, స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర తదితర అంశాలపై సమీక్షించారు. అనంతరం కలెక్టర్ చేతన్ జిల్లా అధికారులతో మాట్లాడారు. మార్చి 17 నుంచి 31 వరకు జరిగే పదో తరగతి పరీక్షల ఏర్పాట్లలో లోపాలు ఉండకూడదన్నారు. పీ–4 సర్వే పక్కాగా చేసి నిరుపేదలకు సంక్షేమ ఫలాలు అందేలా చూడాలన్నారు. మార్చి 15న చేపట్టే స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు.

232 మంది విద్యార్థుల గైర్హాజరు

పుట్టపర్తి: ఇంటర్ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఫిజిక్స్/ ఎకనామిక్స్ పేపర్–2 పరీక్షలకు జిల్లాలో 232 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విద్యార్థులు 9,329 మందికి గాను 9,134 మంది హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సుకు సంబంధించి 1,147 మందికి గాను 1,110 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, ఇంటర్ బోర్డ్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రఘునాథరెడ్డి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశవ ప్రసాద్, కమిటీ సభ్యులు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

సింహ వాహనంపై దర్శనమిచ్చిన ఖాద్రీశుడు



సింహవాహనంపై లక్ష్మీనారసింహుడు



శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తజనం

కదిరి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి నాల్గవ రోజైన బుధవారం సింహ వాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. సింహం శౌర్యానికి, గాంభీర్యానికి, పరాక్రమానికి ప్రతీక. స్వామివారికి ప్రీతి పాత్రమైన ఈ సింహ రూపంలోనే నర–సింహ అవతారమెత్తి హిరణ్య కశిపుడిని సంహరించారు. స్వామి వారు తిరువీధుల్లో ఊరేగుతుంటే ఎప్పటి లాగానే తమిళనాడుకు చెందిన నాదస్వరం, డోలు విద్వాంసులు శ్రీవారి వాహనం ముందు భక్తితో పాటు తమ కళను చాటుకున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల కాలక్షేపం కోసం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీ నారసింహుడు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఖాద్రీ ఉత్సవాలకు 30 ప్రత్యేక బస్సులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎం మధుసూదన్

పుట్టపర్తి టౌన్: కదిరిలో ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు జరిగే ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలకు సాధారణ చార్జీలతోనే 30 ప్రత్యేక బస్ సర్వీసులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్‌ఎం మధుసూదన్ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో జిల్లాలోని అన్ని డిపోల మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ పర్సన్లు, అకౌంట్స్ విభాగం సూపర్‌వైజర్లతో సమావేశమై మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బస్ స్టేషన్లలో తాగునీరు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కదిరి బ్రహ్మోత్సవాలకు పొరుగు జిల్లాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకూ సాధారణ చార్జీలతో అన్ని డిపోల నుంచి 30 ప్రత్యేక బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల రద్దీని అంచనా వేసి సర్వీసులు తిప్పాలన్నారు.

ప్రజాహితమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

పుట్టపర్తి/పెనుకొండ రూరల్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, మాజీ ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, ఆయా నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అన్ని నియోజకవర్గాల్లోనూ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- పెనుకొండలో జరిగిన కార్యక్రమంలో ఉషశ్రీ చరణ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. గత 15 సంవత్సరాలుగా జగన్‌కు అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహులు, సుధాకరరెడ్డి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ సునీల్, వైశాలి జయశంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ నాగలూరు బాబు, కౌన్సిలర్లు శేషాద్రి, యాసిన్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.
- పుట్టపర్తిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ శ్రేణుల సమక్షంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి డీఎస్ కేశవరెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- ధర్మవరంలోమాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం పెద్ద ఎత్తున జరిగింది. పార్టీ జెండాను మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆవిష్కరించారు.
- మడకశిరలో పార్టీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం దినోత్సం ఘనంగా జరిగింది. అంతకు ముందు ఆయన వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.
- కదిరిలో పార్టీ సమన్వయర్త మగ్బుల్ అహమ్మద్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వజ్ర భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- హిందూపురంలో పార్టీ సమన్వయకర్త దీపిక ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత వేణురెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ బలరామిరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.




పెనుకొండలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్, పుట్టపర్తిలో పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, పార్టీ ముఖ్య నేతలు

క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు పరిశీలన



వేరుశనగ దిగుబడిని పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం సిద్దరాంపురం సమీపంలో రైతులు సాగు చేసిన వేరుశనగ పంటకు సంబంధించి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియను కలెక్టర్ టీఎస్ చేతన్ బుధవారం పరిశీలించారు. వేరుశనగ దిగుబడిపై రైతు కేశవతో ఆరా తీశారు. నిర్ణీత గడువులోపు ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావుకు సూచించారు. అనంతరం సమీపంలోని మునగ పంటను పరిశీలించారు.

చింత పండు ధర తగ్గుముఖం



మార్కెట్‌కు వచ్చిన చింత పండు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం 1573.50 క్వింటాళ్ల చింత పండు విక్రయానికి రాగా... మీడియం ఫ్లవర్ రకం క్వింటా గరిష్టం రూ. 13వేలు, కనిష్టం రూ.4,300 చొప్పున సగటున రూ.6వేలతో అమ్ముడుపోయింది. అలాగే కరిపులి (ఫైన్) క్వింటా గరిష్టం రూ.33వేలు, కనిష్టం రూ.8వేలు, సగటు రూ.15వేలు చొప్పున ధర పలికింది. గత సోమవారం క్వింటా కరిపులి గరిష్ట ధర రూ.40వేలు కాగా, బుధవారం రూ.33వేలకు చేరుకోవడం గమనార్హం. క్రయవిక్రయాలను మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి పర్యవేక్షించారు.

'పీఎంఏవై'లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అదనపు లబ్ధి

ప్రశాంతి నిలయం: ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం కింద బీసీ, ఎస్సీ, ఎస్టీల గృహ నిర్మాణాలకు అదనపు ఆర్థిక లబ్ధిని ప్రభుత్వం చేకూరుస్తోందని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పీఎంఏవై 1.0 కింద జిల్లాకు 71,969 ఇళ్లు మంజూరు కాగా, ఇందులో 25,203 గృహాలు పూర్తయ్యాయని, మిగిలిన 40,024 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఇంటి నిర్మాణానికి యూనిట్ ధర రూ.1.80 లక్షలుగా నిర్దేశించినట్లు తెలిపారు. దీనికి అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.70 వేలు ఆర్థిక లబ్ధి ఉంటుందన్నారు. ఇందులో నిబంధనలు వర్తిస్తాయన్నారు. తద్వారా జిల్లాలో 9.009 మంది బీసీలు, 1,548 మంది ఎస్సీలు, 548 మంది ఎస్టీలకు అదనపు లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీవరకు లబ్ధిదారుల ఇళ్లకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వెళ్లి అదనపు లబ్ధి గురించి వివరించి, వారి ఇంటిని ఫొటో తీసుకుంటారన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

ప్రశాంతి నిలయం: అభాగ్యులకు సేవలు అందించడమే సత్యసాయి సేవా సంస్థల లక్ష్యమని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్ రాజు అన్నారు. బుధవారం ప్రశాంతి నిలయంలోని నార్త్ బిల్డింగ్స్ వద్ద సత్యసాయి దివ్యాంగ్జన్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ప్రత్యేక అవసరాలున్న 113 మందికి కృత్రిమ అవయవాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నాకర్ రాజు మాట్లాడుతూ.. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో సత్యసాయి శత జయంతి వేడుకలను పురస్కరించుకుని సత్యసాయి దివ్యాంగ్జన్ ప్రాజెక్ట్‌ను చేపట్టడం జరిగిందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా స్వశక్తితో జీవిస్తున్న దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్నట్లుగా పేర్కొన్నారు.



కృత్రిమ అవయవాలను పరిశీలిస్తున్న ఆర్.జె.రత్నాకర్‌రాజు

ఆకట్టుకున్న నృత్యరూపకం..

సత్యసాయి తత్వాన్ని వివరిస్తూ 'సాయి ప్రేమ్‌కి గంగా' పేరుతో బిహార్, జార్ఖండ్‌కు చెందిన సత్యసాయి విద్యాసంస్థల చిన్నారులు ప్రదర్శించిన నృత్యరూకం ఆకట్టుకుంది. పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన వారు బుధవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



నృత్యరూపకంలోని ఓ సన్నివేశం

ఈ రస్తాలో తిరిగితే అంతు చూస్తా..

- గ్రామస్తులను బెదిరించిన కూటమి నేత
- రహదారికి మొద్దులు అడ్డుగా వేసిన వైనం



రస్తాకు అడ్డుగా వేసిన మొద్దులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: 'ఇది నా దారి. ఈ దారి గుండా ఎవరు వెళ్లినా వారి అంతు చూస్తా' అంటూ కొంత కాలంగా గ్రామస్తులను ఓ కూటమి నేత బెంబేలెత్తిస్తున్నాడు. రహదారికి ఏకంగా మొద్దులు అడ్డుగా వేసి హెచ్చరికలు జారీ చేస్తున్నాడు. వివరాలు... ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామంలో శింగంశెట్టి వంశస్తులకు చెందిన 50 కుటుంబాల వారు ఓ కాలనీలో నివాసం ఉంటున్నారు. కాలనీకి సమీపంలో ఓ ఆలయాన్ని నిర్మించాలని అప్పట్లో గ్రామ పెద్దలు తీర్మానించారు. అయితే స్థల వివాదం తలెత్తడంతో ఆలయ నిర్మాణాన్ని కొందరు వ్యతిరేకించారు. ఈ సమస్య ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉంది. మరికొన్ని రోజుల్లో తీర్పు వెలువడే అవకాశం ఉండడంతో గ్రామానికి చెందిన కూటమి నాయకులు వర్గ కక్షలకు ఆజ్యం పోశారు. ఏళ్ల తరబడి ఆ కాలనీ నుంచి ప్రధాన రహదారికి ఉన్న రస్తా వెంట కాలనీ వాసులు తిరుగుతుండేవారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తర్వాత గ్రామానికి చెందిన కూటమి నేత ఆధిపత్యం కోసం రస్తా విషయాన్ని తెరపైకి తెచ్చాడు. ఈ రస్తా స్థలం తనకు సంబంధించిందని, తన పట్టా భూమిలో ఉందని, ఆ రస్తా వెంట ఎవరూ వెళ్లకూడదంటూ వారం రోజులుగా గ్రామస్తులకు కంటి మీద కునుకు లేకుండా చేశాడు. ఉన్నఫలంగా బుధవారం రస్తాకు మొద్దులు అడ్డుగా పెట్టి అక్కడే కుర్చీలు వేసుకుని తన వర్గీయులతో కలసి కూర్చొన్నాడు. తన మాట బేఖాతరు చేసి రస్తాలో అడుగుపెడితే అంతు చూస్తానంటూ రెచ్చిపోయాడు. దీంతో కాలనీ వాసులు విషయాన్ని రెవెన్యూ, పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో సాయంత్రం అధికారులు వచ్చి రస్తాకు అడ్డుగా వేసిన మొద్దులను తొలగించారు.

విద్యుదాఘాతంతో చిన్నారి మృతి

డి.హీరేహాళ్(రాయదుర్గం): డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామానికి చెందిన తిప్పేస్వామి, రూతమ్మ దంపతుల మూడవ కుమార్తె అర్పిత (5) ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై బుధవారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన మేరకు.. పాఠశాలకు వెళ్లి ఇంటికి వచ్చిన అర్పిత బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. ఆ సమయంలో విద్యుత్ బల్బుకు అనుసంధానం చేసిన వైరు తెగి రేకు తలుపుపై పడింది. విషయాన్ని గమనించని బాలిక తలుపు తీసేందుకు ప్రయత్నించినప్పుడు షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. బాత్రూమ్‌కు వెళ్లిన బిడ్డ ఎంతసేపటికి రాకపోవడంతో అటుగా వెళ్లి గమనించిన తల్లికి విగత జీవిగా పడి ఉన్న అర్పిత కనిపించడంతో గట్టిగా కేకలు వేసింది. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని విద్యుత్ సరఫరాను ఆపి అర్పిత మృతదేహాన్ని బయటకు తీసుకొచ్చారు. కాగా, బతుకు తెరువు కోసం బెంగళూరుకు వలస వెళ్లిన తండ్రి తిప్పేస్వామికి విషయాన్ని చేరవేయడంతో ఆయన బయలుదేరినట్లు సమాచారం.

'దుర్గం'లో దోపిడీ దొంగల బీభత్సం

- రెండిళ్లలో వరుస చోరీలు
- ముదిగల్లు బైపాస్‌లో నాలుగు గొర్రెల అపహరణ
- అర్ధరాత్రి కత్తులతో హల్‌చల్ చేసిన దుండగులు



కత్తులతో సంచరిస్తున్న దుండగులు

కళ్యాణదుర్గం: పట్టణంలో మంగళవారం అర్ధరాత్రి దోపిడీ దొంగలు బీభత్సం సృష్టించారు. కత్తులు చేత పట్టుకుని హల్‌చల్ చేశారు. ఏకంగా రెండిళ్లలో చోరీలకు పాల్పడి, మరో ఇంట్లోకి చొరబడేందుకు విఫలయత్నం చేశారు. పోలీసులు తెలిపిన మేరకు.... కళ్యాణదుర్గంలోని పార్వతీ నగర్ మొదటి కాలనీలో నివాసముంటున్న దీప, అనిల్ దంపతులు మంగళవారం రాత్రి భోజనం ముగించుకుని ఇంటికి తాళం వేసి పైకెళ్లి నిద్రించారు. విషయాన్ని గుర్తించిన దుండగులు లోపలకు చొరబడి బీరువాను ధ్వంసం చేసి, నాలుగు తులాల బంగారు నగలు, రూ.1.60 లక్షల నగదు అపహరించారు. అనంతరం పక్కనే ఉన్న శిల్ప అనే మహిళ ఇంట్లో చొరబడి బ్రాస్‌లైట్‌ను అపహరించారు. అక్కడి నుంచి ముదిగల్లు బైపాస్ సమీపానికి చేరుకుని శ్రీకాంత్ అనే వ్యక్తికి చెందిన నాలుగు గొర్రెలను ఎత్తుకెళ్లారు.

ముసుగులు ధరించి.. కత్తులు చేతపట్టి

పార్వతీనగర్ శివారు ప్రాంతంలోని అక్కమాంబ కొండ సమీపంలో నివాసముంటున్న మీ-సేవ కేంద్రం నిర్వాహకుడు బాబు ఇంటి వద్ద మంగళవారం అర్ధరాత్రి 2.10 గంటల సమయంలో ముగ్గురు వ్యక్తులు ముఖాలకు ముసుగులు ధరించి, కత్తులు చేతపట్టుకుని హల్‌చల్ చేశారు. రెండు, మూడు నిమిషాల పాటు అటుఇటు కలియతిరిగి, ఒకరు కాంపౌండ్ వాల్ ఎక్కి లోపలికి చొరబడే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో కుక్కలు మొరగడంతో అప్రమత్తమైన దుండగులు కాంపౌండ్‌లో నుంచి బయటపడి పారిపోయారు. ఈ దృశ్యాలు అక్కడి సీసీకెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి.

ఘటన స్థలాలను పరిశీలించిన డీఎస్పీ రవిబాబు

పార్వతీనగర్‌లో వరుస దోపిడీల సమాచారం అందుకున్న డీఎస్పీ రవిబాబు, అర్బన్ సీఐ యువరాజు, సిబ్బంది బుధవారం ఉదయం అక్కడకు చేరుకుని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంను రంగంలో దింపి నిందితుల ఆధారాలు సేకరించారు. కాగా, దుండగులు కత్తులు పట్టుకుని సంచరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. వచ్చిన వారు దొంగలా లేక పార్థీ గ్యాంగ్ ముఠా సభ్యులనే అనుమానాలు స్థానికుల నుంచి వ్యక్తమయ్యాయి.

ఇమామూ.. నీ సేవకు సలాం



ఇదో రైతు బిడ్డ వ్యథ. హలం పట్టి పొలం దున్నే సమయంలో ప్రజల ఆకలి, దప్పికలు తీర్చే ఆలోచన తప్ప మరొకటి లేదు. వరుస పంట నష్టాలను తాళలేక కుటుంబాన్ని పోషించుకునేందుకు ఆటో డ్రైవర్‌గా మారినా ప్రజల దాహార్తిని తీర్చడం మరువ లేదు. పది మంది మంచిగా ఉంటే చాలనే మంచి మనసు అన్నదాతకు తప్ప మరెవ్వరకూ లేదని అని నిరూపించారు ఓబుళదేవర చెరువు మండలం సున్నంపల్లికి చెందిన దూదేకుల ఇమాములు. కాలం కలసి రాక వ్యవసాయం మాని 30 ఏళ్ల క్రితం పొట్ట చేత పట్టుకుని అనంతపురానికి చేరుకున్న ఇమాములు ఆటో డ్రైవర్‌గా మారాడు. ఇద్దరు పిల్లలకు ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. ఏటా వేసవి వచ్చిందంటే చాలు.. తన ఆటోలో చల్లని మంచినీటి ట్యాంక్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు ఉచితంగా అందజేస్తున్నారు. 'నేను రైతు బిడ్డను. చల్లని తాగునీరు ఉచితం' అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకుని రైతు సంక్షేమాన్ని మరవొద్దంటూ నేటి తరానికి ఆయన అందిస్తున్న సందేశం స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

– అనంతపురం సిటీ:

76 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

ధర్మవరం రూరల్: మండలంలోని సీతారాంపల్లి వద్ద బొలెరో వాహనంలో అక్రమంగా బెంగళూరు వైపు తరలిస్తున్న 76 బస్తాల (ఒక్కొక్కటి 50 కిలోలు) రేషన్ బియ్యాన్ని బుధవారం రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రీనివాసులు వెల్లడించారు. పోలీసులను చూడగానే వాహనాన్ని ఆపి ఇద్దరు వ్యక్తులు పారిపోతుండగా వెంబండించి అదుపులోకి తీసుకునానమన్నారు. పట్టుబడిన వారిని సోమందేపల్లికి చెందిన షేక్ బాబా, వడ్డె అజయ్‌గా గుర్తించామన్నారు. వీరిపై కేసు నమోదు చేసి, వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించామన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిద్దాం



బత్తలపల్లిలో కాశప్ప పొలంలో ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బత్తలపల్లి: ప్రకృతి వ్యవసాయాన్ని పోత్సహిద్దామని సెర్ప్ ఏపీ సత్యనారాయణ, ఏపీఎం సుదర్శన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోనూ, రాఘవంపల్లిలోనూ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్దామన్నారు. అంతకు ముందు బత్తలపల్లిలో కాశప్ప పొలంలో ఏటీఎం మోడల్ ప్రకృతి వ్యవసాయం గురించి రైతులతో వేయించారు. ఈ విధానంలో రోజూ ఆదాయం పొందుతున్న పార్వతి, గంగమ్మ, నారాయణమ్మ ద్వారా తెలుసుకున్నారు. రాఘవంపల్లిలో శివప్రసాద్ చీనీ పీఎండీఎస్‌లో ఆరు రకాల ప్రధాన పంటలు ఆముదం, కంది, సజ్జ, అనుములు, అలసంద, గోరుచిక్కుడు, 23 రకాల జీవ వైవిధ్య పంటల విత్తనాలు, బీజామృతంతో విత్తనశుద్ధి చేసి, ఘన జీవామృతం ఫైడర్‌తో పాటు కలిపి విత్తినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మండల సమాఖ్య లీడర్లు, సంఘాల సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో అవకతవకలపై విచారణ

ఎన్‌పీకుంట: ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో అవకతవకలు జరుగుతున్నాయని లైన్‌మెన్ రవిశంకర్‌రెడ్డి చేసిన ఆరోపణపై విద్యుత్ శాఖ ఏఈ సాలేహాబాషా బుధవారం విచారణ చేపట్టారు. ఏఈ కార్యాలయంలో లైన్‌మెన్‌లు, గ్రేడ్-2 జేఎల్‌ఎంలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మరికొమ్మదిన్నె పంచాయతీకి చెందిన ఆర్.సరోజమ్మ ట్రాన్స్‌ఫార్మర్ కోసం 2022 జూలైలో దరఖాస్తు చేసుకుందని, ఇందుకు సంబంధించిన ఆధార్, రెవెన్యూ అధికారి జారీ చేసిన వాల్టా సర్టిఫికెట్, బోరు వేసినట్లు బోర్‌వెల్స్ రసీదు, భూమికి సంబంధించిన 1బీ సమర్పించిందని ఏఈ తెలిపారు. బోరుకు సంబంధించి ఎస్టిమేట్ జనరేట్ చేయడంతో 2023 జూలై 25న తగిన రుసుము చెల్లించారని, వరుస క్రమంలో మాత్రమే వారికి విద్యుత్ కనెక్షన్‌కు సంబంధించిన మెటీరియల్ ఇచ్చారని వెల్లడించారు. స్థానిక సెక్షన్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ కానీ, జూనియర్ ఇంజినీరు కానీ లేకపోవడంతో ఉన్న సిబ్బందిలో కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఆంజనేయులు అనే గ్రేడ్-2 జేఎల్‌ఎంను అధికారుల ఆదేశాల మేరకు కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమించినట్లు తెలిపారు. ఇంటికి కానీ, వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్ల కోసం కానీ ఆన్‌లైన్ చేయడానికి మీసేవ లేదా నెట్ సెంటర్‌లో నమోదు చేసుకోవచ్చని, కొద్ది రోజులు మీసేవ లేకపోవడంతో వినియోగదారులు, సిబ్బంది ఆంజనేయులును సంప్రదించి ఆన్‌లైన్ చేసుకున్నారన్నారు. ఈ క్రమంలో వినియోగదారులు, రైతుల నుంచి అధిక మొత్తంలో రుసుము వసూలు చేసినట్లు ఆరోపణలు వచ్చాయని అన్నారు. దీనితో ఆంజనేయులును కార్యాలయం నుంచి ఫీల్డుకు బదిలీ చేయడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు చెప్పారు.

డెంగీ లక్షణాలతో వ్యక్తి మృతి

చెన్నేకొత్తపల్లి: మండలంలోని న్యామద్దెల గ్రామానికి చెందిన సురేంద్ర (34) డెంగీ లక్షణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు. గత 15 రోజులుగా జ్వరంతో బాధపడుతున్న సురేంద్ర చెన్నేకొత్తపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వచ్చారు. అయితే జ్వరం తగ్గక పోవడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. పరిస్థితి విషమిస్తుండడంతో వైద్యుల సూచన మేరకు కర్నూలులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక మంగళవారం రాత్రి ఆయన మృతి చెందాడు. కాగా, డెంగీ లక్షణాలతో మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బాలలపై లైంగిక వేధింపులు నివారించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజబేగం



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: జిల్లాలో బాలలపై లైంగిక వేధింపులను పూర్తిగా నివారించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం, రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ నివేదిత అన్నారు. బాలల లైంగిక వేధింపుల నివారణ అంశంపై బుధవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల్లో వారు మాట్లాడారు. లైంగిక వేధింపులు ఎక్కువగా జరుగుతున్న దృష్ట్యా చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. చైల్డ్ ప్రొటెక్షన్ అత్యవసర సహాయ టోల్ ఫ్రీ నెంబర్లను గుర్తుంచుకోవాలన్నారు. వేధింపులు జరిగినప్పుడు వెంటనే 1098, 181, 100కి కాల్ చేసి సాయం పొందేలా చిన్నారుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. పిల్లలతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. ఏ సమస్య వచ్చినా వెంటనే చెప్పుకునే స్వేచ్ఛను ఇవ్వాలన్నారు. అనంతరం డీఈఐసీ చైల్డ్ అండ్ క్లినికల్ సైకాలజిస్ట్ సిరిగిరి సుందరరావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్, విద్యాశాఖ, జువైనల్ శాఖ, ఒకేషనల్ విద్యాశాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల దాష్టీకం

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై కర్రలతో దాడి



శరీరమంతా కందిపోయిన దృశ్యం



బాధితుడు కురుబ బాలన్న

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన కురుబ చిక్కాల బాలన్నపై టీడీపీ నేతలు అతి కిరాతకంగా కర్రలతో దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటన బుధవారం రాత్రి ఆత్మకూరు మండలం సిద్దరాంపురం గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన మేరకు... బుధవారం సాయంత్రం తన పొలంలో పనులు చూసుకుని ఇంటికి వెళుతున్న బాలన్నపై కాపు కాచిన టీడీపీ నేతలు కర్రలతో విరుచుకుపడ్డారు. నియోజకవర్గంలో సంఖ్యా బలం ఎక్కువగా ఉన్న కురుబలపై దాడి చేయడం ద్వారా వారిలో అభద్రతా భావాన్ని పెంచేందుకు పన్నిన కుట్రలో భాగంగానే ఈ కుట్రకు తెరలేపినట్లుగా పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. దాడి అనంతరం కురుబ చిక్కాల బాలన్న ఆత్మకూరుకు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాడి చేసిన నారాయణస్వామి, రమేష్, భరత్‌పై చర్యలు తీసుకోవాలని కోరాడు.

ఏపీఆర్‌ఎస్ ప్రవేశ పోస్టర్ల విడుదల



పోస్టర్ల ఆవిష్కరణలో పాల్గొన్న డీఈఓ క్రిష్టప్ప

పరిగి: ఆంధ్రప్రదేశ్ గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశాలతో పాటు మిగిలిన తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ పోస్టర్లను బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప విడుదల చేశారు.బుధవారం ఆయన పరిగి మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్‌జేసీ కాలేజ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. క్రిష్టప్ప మాట్లాడుతూ 2025–26 విద్యా సంవత్సరానికి గానూ రాష్ట్ర గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో 5వ తరగతిలో చేరే విద్యార్థులకు ఈనెల 31 వరకూ దరఖాస్తు చేసుకునే అవకాశముందన్నారు. అదే విదంగా 6, 7, 8వ తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లను నోటిపికేషన్ ద్వారా భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు.